క్లుప్తంగా

వైకుంఠ నారాయణ స్వామికి పంచామృతాభిషేకం



స్వామికి పంచామృతాభిషేకాలు

విజయనగరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామనారాయణంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ నారాయణ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చాణక్య, శ్రీ హర్షలు పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నీరజ శ్రీనివాస్, గౌరినిత్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల డీటీ

డెంకాడ: ఓటర్ల జాబితాలను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా తయారు చేసేందుకు బూత్ లెవెల్ అధికారులు నిరంతరం కృషి చేయాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాధరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబిత నాణ్యత, స్వచ్ఛత మెరుగుపరచడనికి బూత్ లెవెల్ అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాధరావు మాట్లాడుతూ ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటర్ల జాబితాలు స్వచ్ఛతగా ఉండాలన్నారు. ఓటర్ల నివాసానికి పోలింగ్ బూత్ రెండు కిలోమీటర్లలోపు ఉండాలన్నారు. ఓటర్లను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటర్లు, రాజకీయ పక్షాల ప్రతినిధుల సూచనలు, సలహాలను స్వీకరించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్‌లు ప్రసన్నకుమార్, సత్తిబాబు, ఏఎస్ఓ కన్నంనాయుడు, సీఏ మధు తదితరులు పాల్గొన్నారు.

సంగీత అకాడమీని సందర్శించిన నెదర్లాండ్ వాసి



నెదర్లాండ్ దేశవాసి హిలంగాను సత్కరిస్తున్న రోటేరియన్స్

విజయనగరం టౌన్: రోటరీ క్లబ్ విజయనగరం కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడపబడుతున్న కొత్త అగ్రహారంలో ఉన్న రోటరీ దళగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీని నెదర్లాండ్ దేశవాసి టి.హిలంగా మంగళవారం సందర్శించారు. వివిధ వాయిద్యాలను అడిగి తెలుసుకున్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి వారికి వాయిద్య పరికరాలు ఇతర వివరాలు వివరించారు. అనంతరం రోటరీ కార్యదర్శి నాగప్రకాష్, ఉసిరికల చంద్రశేఖర్, చినవీరభద్రరావు ఆమెను సత్కరించారు.

మొయిద ఉపాధ్యాయుల ఉదారత



విద్యార్థి తల్లిదండ్రులకు విరాళం అందజేస్తున్న హెచ్ఎం మహాలక్ష్మి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అమరావు అజయ్ బాబు ఇటీవల ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో సమాచారం తెలుసుకున్న ఉపాధ్యాయులు చలించిపోయారు. ఈ నేపథ్యంలో తమ వంతుగా రూ. 45వేలు విరాళాలను సేకరించి విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. అనంతరం తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు భోగాపురపు శ్రీనివాసరావు, కాళ్ల అప్పారావు, బొంతు వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంతం తెలుగు కాలమానిని ఆవిష్కరణ

విజయనగరం టౌన్: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయనగరం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీవిశ్వావసు నామసంవత్సరం త్రైతసిద్ధాంత కాలమానిని ఎమ్మెల్యే అతిది గజపతిరాజు ఆవిష్కరించారు. తెలుగు కాలమానిని ఎంతో ఆధ్యాత్మికం జ్ఞానం ఇమిడ్చి తయారు చేశారన్నారు. ఉగాది పండగ కాలంలో ఒక ప్రత్యేక మార్పుతో వస్తూ, ఎంతో గొప్ప ఆధ్యాత్మిక విశిష్టతను తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ తెలుగు కాలమానిని పొందాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వానపల్లి శంకరరావు, సభ్యులు నాయుడు, ప్రసాద్, రాజేష్, జగన్నాథం, ఆదినారాయణ, వంశీ, శ్రీను పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమంపై..
శీతకన్ను

మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో గత ప్రభుత్వం అందజేసే భృతి కూటమి పాలనలో నిలిచిపోయింది. అలాగని వారి సంక్షేమానికి సంబంధించి ఏ ఒక్క పథకం కూడా గడిచిన పది నెలల్లో వారికి అందలేదు. మళ్లీ వేట నిషేధ సమయం సమీపిస్తోంది. ఈ క్రమంలో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు కూటమి పాలనలో తీవ్రమయ్యాయి. కడలిపై జీవనం కష్టంగానే మారింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

- నేటికీ అందని మత్స్యకార భరోసా
- మరో నెల రోజుల్లో రెండో ఏడాది వేట నిషేధానికి రానున్న ఉత్తర్వులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



చింతపల్లి తీరంలో వేట చేయగా అరకొరగా వచ్చిన చేపలను చూస్తున్న మత్స్యకారులు (ఫైల్)

పూసపాటిరేగ: గత పది నెలలుగా మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకొనే నాధుడు కరువయ్యాడు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయాక మత్స్యకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏటా వారి ఖాతాల్లో నగదు జమ చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.20 వేలు నగదు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినప్పటికీ.. అధికారం చేపట్టి పది నెలలు దాటుతున్నా మత్స్యకార భరోసా ఊసెత్తడం లేదు. మత్స్య సంపద పడక మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క రోజుకు వేటకు వెళ్తే 30 లీటర్ల డీజిల్ వృథా అవుతోంది అని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేటకు వెళ్లినప్పుడు మత్స్య సంపద దొరక్కపోతే ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. మత్స్యకారులకు వేట సాగక ఇబ్బంది పడుతున్నా పాలకులకు భరోసా అందించాలనే ఆలోచన లేకపోవడం ఏమిటని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం ద్వారా అయినా నగదు అందజేస్తే కొంత ఉపశమనం కలుగుతోందని ఆశిస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేకపోవడంతో మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తీరప్రాంతమైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. పరోక్షంగా 15 వేల మంది వేటపై ఆధారపడగా, ప్రత్యక్షంగా 6 వేల మంది వేట చేస్తున్నారు. 27 కిలోమీటర్లు తీర ప్రాంతంలో 885 బోట్లు వేటను సాగిస్తున్నాయి. వేటపై ఆధారపడుతున్న కుటుంబాలు వేట సాగక ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మళ్లీ చేపల వేట నిషేధిస్తూ ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకారులు సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈకేవైసీ పరిశీలన



విజయనగరం నియోజకవర్గ పరిధిలోని రేషన్ లబ్ధిదారులు ఈ నెల 31లోగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సీఎస్‌డీటీ రామారావు పేర్కొన్నారు. విజయనగరంలోని కొత్తపేట బంగారమ్మ చదువు వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. కార్పొరేషన్‌తో పాటు మండల పరిధిలో 17,211 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. రేషన్ లబ్ధిదారులంతా సమీపంలోని రేషన్ డిపో డీలర్ వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. – విజయనగరం

వేడుకగా శ్రీనివాసుని కల్యాణం



విజయనగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని కల్యాణోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు నారాయణం శ్రీనివాస్, నీరజాపల్లి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పీవీ నరసింహాచార్యుల నేతృత్వంలో వేద పండితులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. అనంతరం యాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

జనగణన తరువాతే వర్గీకరణ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రెల్లి కులస్తులు, సంఘ నాయకులు

విజయనగరం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెల్లి కులస్తులకు వర్గీకరణలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రెల్లి కులస్తులు స్థానిక కంటోన్మెంట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. కరోనా సమయంలో ఫ్రంట్ వారియర్స్‌గా గొప్పగా పొగిడిన వారంతా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెల్లి కులస్తులను జనగణన చేసిన తరువాతే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో రెల్లిలకు అన్యాయం చేయొద్దన్నారు. కార్యక్రమంలో బంగారు దుర్గారావు, యర్రంశెట్టి వాలి, శ్రీను, రఘు, రమణ, ధనాల శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జెడ్పీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

విజయనగరం అర్బన్: పుత్ర వియోగంలో ఉన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను పలువురు ఉపాధ్యాయులు మంగళవారం కలిసి పరామర్శించారు. ఆయన ద్వితీయ పుత్రుడు మజ్జి ప్రణీత్ బాబు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. చైర్మన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రణీత బాబుకు నివాళులు అర్పించారు. జెడ్పీ చైర్మన్‌ని పరామర్శించిన వారిలో ఎస్‌టీయూ రాష్ట్ర క్యాదర్శి డి.శ్యామ్, ఎస్‌టీయూ జిల్లా సీనియర్ నాయకులు వి.గోవిందరావు, శ్రీనివాస్ దొర, డి.శ్రీరాములు, ఎన్ని అప్పలనాయుడు, పండిత పరిషత్ ప్రతినిధి ఏలూరు శ్రీనివాసరావు ఉన్నారు.

శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



సత్కారం పొందుతున్న జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియా

విజయనగరం అర్బన్: నర్సింగ్ విద్య కోర్సులతో పాటు జర్మన్ భాషపై అందించిన ఉచిత శిక్షణను ఉద్యోగ, ఉపాధి అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని స్కిల్స్ సంస్థ ప్రతినిధి ఉజ్వల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్) బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సుల విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఎనిమిది నెలల శిక్షణ అనంతరం జర్మనీలో రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల జీతంతో కల్పిస్తున్న ఉద్యోగాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియా మాట్లాడుతూ వీసా, ప్రమాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి వసతి, ఆరోగ్య బీమా, పింఛన్ సదుపాయాలు కలిప్తామని వివరించారు. అనంతరం జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిమ్స్ డైరెక్టర్ టి.వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ సంసీర్ బేగం, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి : డీఎంహెచ్‌ఓ




సతివాడ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

నెల్లిమర్ల రూరల్: వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారిణి ఎస్.జీవనరాణి సూచించారు. మండలంలోని సతివాడ పీహెచ్‌సీను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించి సిబ్బంది విధులపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో ఉన్న మందుల గది, ల్యాబ్, ఓపీ రూమ్‌లను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌సీహెచ్, అభా, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ఎన్‌సీడీ సీడీ, తదితర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటా పర్యటించాలన్నారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్యాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే రోగులు చికిత్సలు జరిగేలా చూడాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సాయిరాం, డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ఈ నెల 31లోగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నీటి పన్ను బకాయిలు మొత్తాన్ని చెల్లించే యజమానులకు 50 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్ను, ఇంటి పన్ను, ఖాళీ స్థలముల పన్ను బకాయిలను ఈ నెల 31లోపు ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికే వడ్డీ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ సదవకాశాన్ని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి 31వ తేదీలోపు ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నులను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో వడ్డీ రాయితీతో ఆస్తి పన్ను చెల్లించవచ్చని కమిషనర్ కె.అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీలో 50శాతం వడ్డీ రాయితీతో పన్ను చెల్లించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 31లోగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయి ఉన్న వారు రాయితీతో చెల్లించవచ్చని అన్నారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకువాలని కోరారు.

పాలకుల నిర్లక్ష్యం... జిల్లాకు శాపం



సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: పాలకుల నిర్లక్ష్యం విజయనగరం సమగ్రాభివృద్ధికి శాపంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యల నిలయం, కళల కాణాచి.. పచ్చని పంటల సమాహారానికి జిల్లా పేరుగాంచిందన్నారు. విజయనగరం జిల్లా అంటే వెనుకబడిన జిల్లాగానే పేరుగాంచిందన్నారు. పాలకులు జిల్లా ప్రజలకు ఉపాధి కల్పించి ఉన్న ఊరును, కన్నతల్లిని వదిలిపోయే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. చదువుకున్న వారిని ఉపాధి చూపించాలన్నారు. జిల్లాలో జ్యూట్ పరిశ్రమ, పంచదార పరిశ్రమ, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కార్పొరేట్ కంపెనీల రాకతో పట్టణంలో చిన్న దుకాణాలు మూతపడే పరిస్థితి దాపురించిందన్నారు. సాంస్కృతిక విశ్వవిద్యాలయం కట్టాలనే ప్రజల ఆకాంక్ష నేటికీ నెరవేరలేదన్నారు. గురజాడ అడిటోరియానికి రూ. 5కోట్లు కేటాయించినా నేటికీ నిర్మించలేదన్నారు. నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పటికి ప్రారంభమవుతుందో, ఎంత మందికి ఉపాధి కల్పిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించి అభివృద్ధి చేయాలని రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణ పౌరుల సంక్షేమ సంఘంగా ఏప్రిల్ 5 న జరగనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రంభ శ్రీనివాసరావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురవుతున్న రాజాంలోని మల్లమ్మ చెరువు

చెరువు.. కనుమరుగు!

- ఆక్రమణలో మల్లమ్మ చెరువు
- కబ్జా చేసేసి భవన నిర్మాణాలు
- నిర్మాణానంతరం ప్లాట్లుగా విక్రయాలు
- పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజాం: పట్టణంలోని మల్లమ్మ చెరువు కనుమరుగవు తోంది. ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకున్న చెరువు ను కాపాడే నాథుడే కనిపించడం లేదు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి మరీ చెరువు ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నారు. అక్రమంగా భవనాలు నిర్మిస్తూ వాటిని ప్లాట్లుగా విభజించి, అమ్మేస్తున్నారు. పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా సంపాదించిన దానిలో కొంత అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొంత ముట్టజెప్పి, తమ పని కానిచ్చేస్తుస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ 32 ఎకరాలకు పైగా ఉండే చెరువు విస్తీర్ణం ప్రస్తుతం 10 ఎకరాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు గుర్రాల చెరువు.. నేడు మల్లమ్మ చెరువు..

ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఒకప్పుడు నాలుగున్నర ఎకరాల విస్తీర్ణం కలిగిన గుర్రాల చెరువు ఉండేది. ఇదే చెరువును అప్పట్లో గుర్రప్ప చెరువుగా పిలిచేవారు. రాజుల కాలంలో రాజాంలోని సంతకు గుర్రాలపై వచ్చే వ్యాపారులంతా తమ గుర్రాలను ఇక్కడి నీటి కొలను(చెరువు)కు తీసుకువచ్చేవారని అందరూ చెబుతుంటారు. ఆక్రమణల్లో చిక్కుకుని ప్రస్తుతం ఈ చెరువు కనిపించకుండా పోయింది. అదే చెరువు పక్కన ఉన్న మల్లమ్మ చెరువుపై ప్రస్తుతం పట్టణంలోని బడాబాబుల దృష్టి పడింది. ఈ చెరువుకు నాలుగు వైపులా పట్టణం విస్తరించి ఉంది. ఓ వైపు ఆర్టీసీ కాంప్లెక్స్, మరోవైపు ప్రధాన రహదారి, ఇంకోవైపు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి ఇలా నాలుగు వైపులా పట్టణం విస్తరించి ఉంది. ఇప్పటికే ఈ చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుని, చదును చేస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. అక్కడి నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేకున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం విద్యుత్ మీటర్లు మంజూరు చేయడం, మున్సిపల్ అధికారులు కూడా తాగునీటి సదుపాయం కల్పించడం జరుగుతోంది. చిన్నచిన్న స్థలాలుగా ఆపు చేసుకుని, అనంతరం వాటిని బిట్లు(చిన్న స్థలం)గా ఒక్కో స్థలాన్ని రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు కబ్జాదారులు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇదేమీ తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.



చెరువు గర్భంలోనే ఇలా అక్రమంగా భవన నిర్మాణాలు



చెరువు భాగంలో నిర్మాణానికి చదును చేసిన ప్రాంతం

చెరువు గట్టుపై రోడ్డు నిర్మాణం..

రాజాంలోని పాలకొండ రోడ్డులో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు వెలిశాయి. వీటి వెనకనే మల్లమ్మ చెరువు విస్తరించి ఉంది. ఇదే అదునుగా ఆయా సంస్థల యజమానులు చెరువు స్థలాన్ని ఆక్రమించి, తమ నిర్మాణాలను వెనక్కి విస్తరిస్తున్నారు. గతంలో ఇదే చెరువు గట్టుపై ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డోలపేటకు రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు కూడా కేటాయించి, గ్రావెల్ రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఇంతలోనే కబ్జాదారులు కళ్లు పడడంతో ఆ చెరువు గట్టు కనిపించకుండా పోయింది.

శ్మశానవాటికలో షాపింగ్‌మాల్‌లు..

ఇదే మల్లమ్మ చెరువుకు ఓ వైపున శ్మశానవాటిక ఉండేది. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగాన ఉండే ఈ శ్మశా నవాటికలో పోలీసులు, మున్సిపల్ అధికారులు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ స్థలం పూర్తిగా ఆక్రమణకు గురైంది. అదే శ్మశానవాటికలో షాపింగ్‌మాల్‌లు, ఇళ్ల నిర్మాణాలు జోరుగా చేసేస్తున్నారు. వీటిని రాజాం పట్టణంలోని ఉద్యోగులు, వ్యాపారులు అద్దెకు తీసుకోవడం, కొనుగోలు చేయడం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

చెరువు ఆక్రమణలపై దృష్టి సారిస్తాం. కబ్జా జరుగుతోందన్న విషయం తమ దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తొలగించేందుకు జిల్లా అధికారులకు నివేదికలు పంపిస్తాం.

–ఎస్‌కే రాజు, తహసీల్దారు, రాజాం